ఓం్రశ్రీసాయిరాం.

అధ్యాపకులారా!

లోకములో మానవుడు నిరంతరము కొన్ని మార్పులను కోరుకుంటాడు. అది ఏవిధమైన మార్పు అని మనం కొంత విచారించాలి. ప్రతి మానవుడు ఏదో ఒక ఉన్నతమైన స్థితిని, ఉత్తమమైన పరిస్థితిని పొందాలని ఆశిస్తూ ఉంటాడు. విద్యాలయములందు విద్యాధ్యయనము చేయు ప్రతి విద్యార్థి, ప్రతి సంవత్సరము పై క్లాసుకు పోవాలని ఉవ్విళూరుతుంటాడు. ఏ విద్యార్థి ప్రతి సంవత్సరము ఒకే క్లాసులో, ఒకే తరగతిలో ఉండాలని అభిలషించడు. అదేవిధముగనే సాధకులైన వ్యక్తులు, అధ్యాపకులు మన ముందున్న స్థానమునుండి ఉన్నత స్థాయికి చేరటానికి తగిన ప్రయత్నము చేయాలి.

బౌద్ధమతమందు 'బుద్ధం శరణం గచ్ఛామి', 'సంఘం శరణం గచ్ఛామి', 'ధర్మం శరణం గచ్ఛామి'. ఈ మూడు విధములైన ప్రబోధములు మనము ఎట్టి స్థాయికి చేరుకోవాలి, గమ్యమును ఏరీతిగా పొందాలి అనే మార్గాన్ని నిరూపిస్తుంది. 'బుద్ధం శరణం గచ్ఛామి'. అనగా కెవలము కొంతమంది వ్యక్తులతో తాను సంబంధాన్ని ప్రారంభించాడన్నమాట. తన దేహముపై తాను ఆధారపడి వుండటం. కాని, నిరంతరము తన దేహముపైన తాను ఆధారపడి ఉండటముచేత ఈ జగత్తునందు ఏమాత్రముకూడను ఒకవిధమైన ఆనందాన్ని అనుభవించలేడు. ఆ వ్యక్తి స్థానమునుండే 'సంఘం శరణం గచ్ఛామి'. సంఘములో ప్రవేశించాడు. సంఘమే లేకపోతే వ్యక్తిత్వమనేది రాణించదు. కేవలము రాణించకపోవటమేగాక వ్యక్తిత్వము కొంతవరకు వ్యక్తము చేయటానికి అవకాశముండదు. మానవునియొక్క జననము, మానవునియొక్క జీవితము, మానవునియొక్క అంత్యముకూడను ఈ సంగముతోనే కట్టుబడి ఉంటుంటాయి. కనుక, వ్యక్తి నుండి సంగము అనే గుంపుతో చేరటం రెండవ మార్గం. అనగా 'I' అనే స్థానమునుండి 'WE' అనే స్థానమునకు ప్రయాణము. 'వ్యక్తి' అనే ప్రదేశమునుండి 'సమష్టి' అనే దానికి ప్రయాణము. అందుకే సాధారణంగా లోకంలో ప్రతి మానవుడు ఈ రెండింటిని మాత్రమే గుర్తునందుంచుకుంటున్నాడు. ఈ రెండు సోపానములు మాత్రమే కాదు, గమ్యమనే మూడవ సోపానము మరొకటి ఉన్నది. ఈ గమ్యమైన మూడవ సోపానము చేరినప్పుడే మానవత్వము ముక్తాళం అవుతుంది. 'ధర్మం శరణం గచ్ఛామి' ధర్మమనగా 'ధారయతీతి ధర్మః'. జగత్తును ధరించినటువంటిది. అనగా విశ్వవ్యాపకమైన తత్త్వము దానిలో ప్రవేశించాలి. కనుక 'బుద్ధం శరణం గచ్ఛామి' కేవలము ఒక మేధస్సు మాత్రమే కాకుండా 'సంఘం శరణం గచ్ఛామి' తిరిగి సమాజంలో ప్రవేశించింది. ఈ అంత్యమనే సోపానములో మనము ప్రవేశించాలి.

దీనినే బైబిల్‌యందు జీసస్ చెబుతూ వచ్చాడు. 'I am the messenger of God' అన్నాడు. ఇది 'బుద్ధం శరణం గచ్ఛామి' అనేటువంటిది. ఇంకా కొంత కాలమయ్యేటప్పటికి 'I am the son of God' అన్నాడు. అనగా సర్వులూ భగవంతుని బిడ్డలే అనే సర్వములో ప్రవేశించాడు. మూడవది 'I and my father are one' అన్నాడు. ఇదే 'ధర్మం శరణం గచ్ఛామి'.

ఇదేవిధముగా పర్షియన్ దేశములోకూడను 'I am in the light' అన్నాడు. ఇది 'బుద్ధం శరణం గచ్ఛామి' అనగా ఒక హద్దులో మాత్రమే ఉండటం. ఇంకా కొంత కాలమయ్యేటప్పటికి రెండవ సోపానము ' the light is in me' ఇది 'సంఘం శరణ్ గచ్ఛామి' అనే స్థాయికి చేరుకుంది. మూడవది ' I am the light' ఇది 'ధర్మం శరణం గచ్ఛామి' . ఇది విశాలమైన దివ్యత్వాన్ని నిరూపిస్తూ వచ్చింది.

దీనినే మన వైదికశాస్త్రములందు ద్వైతము అని చెబుతూ వచ్చారు. ద్వైతమనగా ఏమి? తనయొక్క బుద్ధిని మాత్రమే అనుసరించి నేను, పరులు అనేటువంటి భేదాభిప్రాయముతో జీవించే దానిని ద్వైతమని చెబుతూ వచ్చారు. ఇది కేవలం 'బుద్ధం శరణం గచ్ఛామి' అనే స్థాయికి చేరింది. ఇక రెండవది విశిష్ట అద్వైతం. అనగా ఇందులో ఒక పవిత్రమైనటువంటిదిగా ఉంటున్నాది. నేను మాత్రమేగాదు నా ఆత్మతత్త్వముకూడా ఉంటున్నాది అనే విశ్వాసముచే, ఈ ఆత్మ సమ్మిళితము కావటముచేత, ఆత్మసంస్కారము కావటంచేత, ఆత్మయొక్క శీలము కావటముచేత ఇక్కడ విశిష్ట అద్వైతము అయినది. ఇది 'సంఘం శరణం గచ్ఛామి'. సర్వులయందుకూడ అటువంటి ఆత్మ ఉంటున్నాది. ఇది సంఘముచే కూడి ఉంటున్నాది. అనగా నేను అనేది ఏవిధంగా ఉందో, ఆ నేను అనే వ్యక్తిత్వములో ఏయొక్క ఆత్మ ఉన్నదో సర్వులయందుకూడను అదే ఆత్మ ఉన్నదని సమాజానికి కూడను కొంత సంబంధించినటువంటిదిగా ఏర్పడినది. వైదిక సాంప్రదాయములో నేను అనేది కేవలము దేహమునకు మాత్రమే సంబంధించక ఆత్మకు సన్నిహితమై వుంటున్నాది. కనుక, సర్వులయందుకూడను ఈ నేను అనేటువంటిది సమానముగా వుండటముచేత ఇది సంఘముగా ఏర్పాటుచేయబడినది. ఉదాహరణ– ఎవరు కస్తూరి అని నేను ప్రశ్నించాను. అక్కడ ఉన్నాడు. నేను అన్నాడు. ఎవరు క్రాక్సీ అని ప్రశ్నించాను. నేను అన్నాడు. ఎవరు మణెమ్మ అని ప్రశ్నించాను. నేను అని ఆమె చెప్పింది. మణెమ్మ రూపనామములు, కస్తూరి రూపనామములు, క్రాక్సీ రూపనామములు భిన్నభిన్నముగా ఉండినప్పటికీ ఈ నేను అనేది అందరికీ కూడను ఒకే ఆత్మగా ఉండినది. కనుక, నేను అనేది దేహమునకు సంబంధించినది కాదు. హృదయానికి సంబంధించినది కాదు. ఈ నేను కేవలము ఆత్మకు సంబంధించినది. ఈ రూపనామములు కోవలము భౌతికమైనవే. కాని, సర్వులయందు ఏకత్వమైనది ఆత్మ ఒక్కటే కనుక విశిష్ట అద్వైతమన్నారు. ఇది 'సంఘం శరణం గచ్ఛామి' యొక్క సోపానము వంటిది.

మూడవది అద్వైతము. ఇదే 'ధర్మం శరణం గచ్ఛామి'. దీనికి బైబిల్ యందుకూడను all are one అనగా అందరియందు

ఏకత్వమనేది ఉన్నది కనుక ఆ ఏకత్వాన్ని సంస్కరించటమే, భిన్నత్వాన్ని త్యజించటమే నిజమైన అద్వైతము. కనుక, ఈ దైవత్వమనేది లేకుండా వ్యక్తిత్వము ఏ దేశమునందుగాని, ఏ కాలమునందుగాని, ఏ పరిస్థితియందుగాని ఉండుటకు వీలుకాదనే సత్యాన్ని నిరూపించవచ్చు. ఈ అద్వైతము దేశకాల పరిస్థితుల ప్రభావమునకు ఏమాత్రముకూడను గురికానట్టిది.

కనుక, మనము ద్వైతమునుండి విశిష్టఅద్వైతమునకు, విశిష్టఅద్వైతమునుండి అద్వైతమునకు ప్రయాణము చేయటమే మానవత్వముయొక్క విశిష్టత. కనుక, దేశమునకు ఆదర్శ పురుషులైనవారంతాకూడను ఈవిధమైన ప్రయాణము జరిపియే దైవత్వమును దర్శిస్తూ వచ్చారు. మహమ్మద్‌గాని, జీసస్‌గాని అందరూకూడా మొట్టమొదట I am the messenger of God, next, I am the son of God, next, I and my father are one. ఈ ప్రయాణము వారు జరుపుతూ రావటం వలనే ఈ పవిత్రమైన ఉపదేశములు ప్రజలకు చేయటానికి అర్హులైనారు. మానవులు చేసే ప్రయాణములలో మధ్యమధ్య కొన్ని స్టేషన్లు వచ్చినప్పటికీ వాటిని మనము లెక్కచేయనక్కరలేదు. మన ప్రయాణము చేరు గమ్యము, అంత్యమనే స్థాయికి మనము చేరాలి. ఈ సత్యాన్ని మనము చిత్తమునందుంచుకొని తద్వారా విద్యార్థులకు తెలియజేయటానికి ప్రయత్నించాలి. ప్రతి మానవుడూ తాను చేసే కార్యములో జయిస్తానని, విజయాన్ని పొందాలని అభిలషిస్తూ ఉంటాడు. అపుడు ఆ విజయము త్వరలోనే దొరకవచ్చు లేదా కొంత ఆలస్యముకూడా కావచ్చు. ఏమైతేనేమి, ఆ విజయాన్ని మాత్రము సాధించాలనే లక్ష్యము ప్రతి ఒక్కరి హృదయమందు స్థిరమై ఉంటుంది.

ఈ విజయాన్ని సాధించటానికి ఒక్కొక్క మార్గము, విధానము వుంటున్నాది. ఒక ఇల్లు కట్టాలనే సంకల్పము మనలో ప్రవేసించింది. సంకల్పించినంత మాత్రమున ఇల్లు తయారౌతుందా? మొట్టమొదట ఒక ప్లాను వేయాలి. ఆ ప్లాను వేసిన తరువాత దానికి ఒక రోజు భద్రమైన ఫౌండేషన్ తవ్వాలి. క్రమక్రమేణా గోడలు కట్టటము, రూఫ్ వేయటము , ప్లాస్టరింగ్ చేయటము ఈ ఇల్లు కట్టుకొనే మార్గము. అదేవిధముగా వ్యవసాయము. ఏ భూమిలో ఏవిధమైన విత్తనములు నాటాలి, ఏవిధమైన ఎరువులు వేయాలి, పంటను ఎప్పుడు పండించాలి అనే విధివిధానమును కొంతవరకు విచారణ చేయాలి. ఈ విధానాలు తెలియక పంటలు పండించలేము, ఇల్లు కట్టించలేము. అదేవిధముగా విద్యార్జనకు కూడా కొన్ని విధివిధానములు వుంటున్నాయి. పరీక్షలలో కొంతమంది ఉత్తీర్ణులవటం, కొంతమంది అపజయాన్ని పొందటం జరుగుతున్నాది. అందరూ ఉత్తీర్ణులు కావటానికి వీలుకాదు అనే ఒక అపోహ ప్రజలలో వ్యాపించింది. ఇది సరైనది కాదు. ఈ విద్యార్థులు అపజయాన్ని అందుకోవటానికి కారణమేమిటి? లేక విజయాన్ని పొందటానికి కారణమేమిటి? దీనికికూడా కొన్ని విధివిధానములుంటున్నాయి. వారు పాటించకపోవటం చేతనే కొంతమంది అపజయాన్ని అందుకుంటున్నారు. కొంతవరుకు గ్రుడ్డిగా చదివి తలలో చేర్చుకొని ఈ జ్ఞాపకశక్తి వల్ల కొంతమంది ఉత్తీర్ణులవుతున్నారుగాని, ఉత్తీర్ణులైనవారుకూడ విధివిధానములను పాటించటం లేదు. అధ్యాపకులు ఈ విధివిధానాలు విద్యార్థులకు బోధించటానికి ప్రయత్నించినప్పుడు ప్రతి విద్యార్థి కూడను ఉత్తీర్ణుడు కాక తప్పదు.

మొట్టమొదటిది విద్యార్థిలో బలమైన ఆకాంక్ష ఉండాలి. నేను ఉత్తీర్ణడు కాగలను, మొదటి తరగతిలో ఉత్తీర్ణుడు కాగలను అనే దృఢమైన విశ్వాసము ఉండాలి. success begets success అని ఇంగ్లీషులో ఒక సామెత ఉంటున్నాది. ఒక విజయాన్ని మనం పొందినామంటే, ఆ విజయముయొక్క బలముచేతను, ఆ విజయముయొక్క ధైర్యము చేతను అనేక విజయాలు మనం పొందవచ్చు. అదే అపజయమైతే, ఆ అపజయము వలన కొన్ని బలహీనతలు ఏర్పడి నిరుత్సాహము కలిగి తాను దేనికీ పనికిరాని వ్యక్తిగా భావించుకొని అనేక అపజయాలనుకూడా అందుకోగలడు. ఇక్కడ అపజయము పొందుటలో తప్పు లేదు. లక్ష్యము చిన్నదిగా పెట్టుకోవటమే తప్పుగా ఉంటుంది. లక్ష్యాన్ని మాత్రము ఉత్తమంగా పెట్టుకోమని పిల్లలకు బోధించాలి. రెండో పర్యాయము కష్టపడి ఆ అపజయాన్ని మించినటువంటి విజయాన్ని అందుకోమని వానికి ఉత్సాహాన్ని బోధించాలి. ఇది మొట్టమొదట ఉండవలసిన లక్ష్యము. అనగా బలమైన ఆకాంక్ష. ఒకవిధమైన వాంఛ వుంటుండాలి.

ఇక రెండవది. మనకంటే ఉత్తమమైన వారు, సరియైన విజయాన్ని సాధించిన వారితో కొంతవరకు చేరుతూ ఉండాలి. ఆ కోరిక ఉండినప్పుడే నేనుకూడా వారివలె ముందుకు పోవాలి, నేనుకూడా వారివలె విజయాన్ని సాధించాలి, నేనుకూడా వారివలె ఉత్తీర్ణుడు కావాలి అనే ఉత్సాహము అతనిలో కొంతవరకు బలపడుతుంది. మనము పిల్లలకు ఇలాంటి విజయాలు సాధించిన వ్యక్తులయొక్క అనుభూతులను అప్పుడప్పుడు చేబుతూ రావాలి. ఇంతేకాదు ఆ పిల్లలు నివసించే గదులయందుగాని, వారి పుస్తకములయందుగాని ఇలాంటి విజయాన్ని సాధించిన వారియొక్క ఫొటోలు వారికి చూపాలి. ఈనాడు దురదృష్ట వశాత్తూ పిల్లలు చదువుకొనే గదుల్లో సినీమా పిక్చర్సు పెట్టుకుంటున్నారు. దీనివల్ల ఈ పిల్లల ఉత్సాహముగాని, విజయాన్ని సాధించాలన్న ఆకాంక్షగాని లేకపోవటం వల్ల అపజయాన్ని పొందుతున్నారు. మనకంటే ఉత్తమమైన వారితో కొంతవరకు పోల్చుకోవాలి.

మూడవది గొప్ప ఆశయము. ఎప్పుడు గొప్ప ఆశయము ఉంటుందో మన స్నేహితులు కూడను గొప్పగా చూడటానికి ప్రయత్నిస్తారు. ఏమిటి ఆ పెద్ద ఆశయము? పాసుమార్కులు 35 అని వారు 35 మార్కులపైనే లక్ష్యముగా పెట్టుకుంటే 25 మార్కులు మాత్రమే వస్తాయి. లక్ష్యము చాలా చిన్నదిగా ఉంటున్నది. అటుల కాదు. గొప్ప ఆశయాన్ని పెట్టుకోండి. 95 మార్కులు

రావాలని లక్ష్యము పెట్టుకొంటే కనీసం 60, 65 మార్కులకు తగ్గవు. కనుక, ఈ ఉత్తమమైన ఆశయము మూడవ పాయింట్. చిన్న చిన్న విషయములను నీవు ఏమాత్రమూ పెద్దగా చర్చించవద్దు. మీరు గొప్ప ఆశయమును మొట్టమొదట విద్యార్థులకు ఉండవలసినదిగా మీరు బోధించాలి. దీనినే తెలుగులో చెబుతూ వచ్చారు. 'వెంటబడి కుంటి నక్కను కొట్టేదానికంటే గురితప్పినా మంచి పులినే కొట్టు' అన్నారు. మన తక్కువ ఆశయము ఈవిధమైన కుంటినక్కను కొట్టినట్లుగా ఉంటుంది. మన గురి తప్పినాగాని పెద్ద ఆశయాలతో వుంటుండాలి. ఇది పిల్లలకు లేత వయస్సునందే బోధించాలి.

ఇక నాల్గవది యేమంటే ఒక సమస్థితి. సమస్థితి అనగా సమానము చేసుకుంటూ రావాలి. ఒక చిన్న ఉదాహరణ. ఈ పాత్రలో నీరు ఉంటున్నాది. ఈ నీరంతా పోవలెనంటే దీని చుట్టూ రంధ్రములు కొట్టనక్కరలేదు. ఒక చిన్న రంధ్రముంటే చాలు. క్రమక్రమేణా ఇదంతా ఖాళీ అయిపోతుంది. ఇక్కడ సమస్థితి అనగా ఏమిటి? మీకు కొన్ని సబ్జక్ట్సుపై ఇంటరెస్టు ఉంటుంది. మిగిలిన సబ్జక్ట్సు లోపల నీవు సరైన శ్రద్ధ చూపకపోతే ఫెయిల్ అవటానికి అవకాశము ఉంటుంది. కాబట్టి , నీ యిష్టమైన సబ్జక్ట్‌లో మాత్రం ఎక్కువ మార్కులు తెచ్చుకొని, ఇష్టము లేని దానిలో ఫెయిల్ అయిపోవటం చేత నీవు పూర్తిగా ఫెయిల్ అవుతావుగాని దీంట్లో విజయాన్ని సాధించలేవు. ఆరు సబ్జక్ట్స్‌లో నీకు మంచి మార్కులు వచ్చిననూ ఒక్క సబ్జక్ట్‌లో నీకు తక్కువ మార్కులు వచ్చి ఫెయిల్ అవుతే పూర్తి ఫెయిలే. కనుక, మనం ఫెయిల్ అవటానికి ఒక సబ్జక్ట్ చాలు. ఏ దాంట్లో మనము ఇంటరస్ట్ లేకుండా ఉంటామో దానిపైనకూడా మనం అంత ఇంటరెస్ట్ పెంచుకోవాలి. దానిపైన ఇష్టాన్ని కలిగించుకొని దానియందుకూడను ఉన్నతమైన మార్కులు తెప్పించుకోవాలి. దీనినే సమదృష్టి అంటారు. నీకు ఇష్టమున్నదానిపైనగాని, ఇష్టములేనిదానిపైనగాని సమత్వాన్ని అభివృద్ధి పరచుకుంటూ చదువుతూ రావాలి. అప్పుడే మన బుద్ధికుశలతగాని, మానసిక వికాసముగాని మనలో పెరగటానికి అవకాశముంటుంది. ఈవిధమైన సమస్థితి పిల్లలకు బోధిస్తూరావాలి.

ఇంక ఐదవది జ్ఞాపకశక్తి. ఈ జ్ఞాపకశక్తి మనకు లేదా? ఉన్నది. ఈ జ్ఞాపకశక్తికి ఆసక్తి కొంత చేర్చాలి. చాలామంది క్లాసు తేవాలని తలుస్తారు. చేతిలో పుస్తకము పెట్టుకుంటాడు. కళ్ళు అక్షరాలపై పెడతాడు. నోటితో చదువుతాడు. కాని, మనస్సు మాత్రం ఉండదు. కనుక, మొట్టమొదట కన్నులు, చేతులు, నోటితోబాటు ఈ మనస్సును ఏకీభావంచేయాలి. ఈవిధముగా మనము చదవాలి. ఇందులో ఉత్తీర్ణులు కావాలి అనే ఆసక్తితో ఈ జ్ఞాపకశక్తిలో పెట్టినపుడు తప్పక మనకు క్లాసు వస్తుంది. చిన్న ఉదాహరణ. పాఠ్యపుస్తకాలు చదివినప్పుడు జ్ఞాపకం లేదంటారు. ఒక గంటకుముందు చదివినదికూడా మరొక గంటకు మర్చిపోతాము. ఇదే పిల్లలు రెడియోలో సినీమా పాటలు వస్తుంటే ఆ సినీమా పాటలన్నీ జ్ఞాపకం పెట్టుకుంటారు. పది సినీమాలు చూస్తే పది సినీమాలలోని పాటలు వారి తలలో ఉంటాయి. పాఠ్యపుస్తకము చదివితే రెండు లైన్లు అయినా జ్ఞాపకం లేకుండాపోవటానికి, సినీమా పాటలంటే జ్ఞాపకం ఉండటానికి కారణం ఏమిటి? సినీమాపై ఆసక్తి ఉంది. ఈ పాఠ్యపుస్తకంపై ఆసక్తి లేదు. కనుక, ఈ జ్ఞాపకశక్తిని, ఆసక్తిని కొంతవరకు అభివృద్ధి చేయాలి.

ఇక కట్టకడపటిది, ఆరవది. ఇది చాలా ప్రధానమైనది. విధానము. ఇది ఏవిధముగా అభివృద్ధి పరచుకోవాలి? ఏవిధముగా మనం అనుసరించాలి? మనము పరీక్షలకు వెడుతున్నాము. పరీక్ష ఏవిధముగా జరుగుతున్నాదని మొట్టమొదట విచారణ చేయాలి. పరీక్షలో వ్రాయుట జరుగుతున్నాది. కాని, విద్యార్థులు ఏమి చేస్తున్నారు? పరీక్షల కోసం చదువుతున్నారు. ఇది చదవటం, అది వ్రాయటం. కనుక, ఈ రెండూ విరుద్ధము. చదువునటువంటిది వ్రాయుటకు వీలుకాదు. వ్రాయునటువంటిదానిని చదివితే ప్రయోజనము లేదు. కనుక, పాఠ్యపుస్తకములోని ఇంపార్టెంట్ విషయములను వెంటనే నోట్‌బుక్‌లో వ్రాయటానికి ప్రారంభించాలి. సంవత్సరమంతా ముఖ్యమైన విషయాలను వ్రాస్తూంటే చక్కగా విజయాన్ని పొందగలుగుతారు. అంతేకాకుండా చదివితే అర్థంకాని విషయాలు వ్రాస్తే అర్థమవుతాయి. మనము పరీక్షలో వ్రాసేది మనము ప్రాక్టీస్ చేసినప్పుడు ఈ పరీక్షలో ఉత్తీర్ణుడౌతాడు విద్యార్థి.

ఈ ఆరు రకములైన మార్గాలుకూడను మనము విద్యార్థులకు బోధించిన ఏ విద్యార్థికూడను అపజయము పొందటానికి ఏమాత్రమూ అవకాశముండదు. కనుక, మొట్టమొదట విద్యార్థులకు బలమైన కాంక్ష, ఆసక్తిని పెంచాలి. రెండవది ఉత్తములతో కొంతవరకు పోల్చుకుంటూ రావాలి. మూడవది గొప్ప ఆశయము ఉంటుండాలి. నాల్గవది సమస్థిత దృష్టి ఏర్పడాలి. ఐదవది జ్ఞాపకశక్తి. ఆరవది పరీక్ష వ్రాసే విధానానికి అనుగుణంగా ప్రిపేర్ అవాలి. ఈవిధమైనటువంటివి అధ్యాపకులు విద్యార్థులకు హెచ్చరిస్తే విద్యార్థులు విజయమునందుకొని తద్వారా వృద్ధిలోకి రావటమేకాకుండా ఈ విద్యారంగములో శాశ్వతమైన పరిష్కారాన్ని తీసుకువస్తారు. ఈ విధివిధానాన్ని విద్యార్థులు అనుసరించటము లేదు. ఏదో పరీక్ష సమయములో చదివి, టీ త్రాగి, త్రాగి, త్రాగి రాత్రంతా మేలుకొని ఆ పుస్తకములోపల నున్నది మస్తకములో పెట్టుకొని, ఆ మస్తకములోనున్నదంతా పరీక్షహాలులో ఖాళీచేసి వస్తున్నారు. పరీక్ష అయిపోయిన తరువాత వారికి ఏవిషయమూ తెలియదు. వారు డిగ్రీ తెచ్చుకుంటున్నారేగాని ఆ డిగ్రీకి సంబంధించిన క్వాలిఫికేషన్ మాత్రము లేదు. అలాంటివారు తిరిగి విద్యార్థులకు చెప్పాలంటే తిరిగి తాను పుస్తకం చదువుతూ చెబుతూ రావాలి. ఈవిధముగా చేసేటువంటి బోధ ఏమాత్రమూ నిలవదు. నీ జీవితమే ఒక పుస్తకముగా మారిపోవాలి. అప్పుడే తన అనుభూతిని క్రియారూపంలో పెడతాడు. ఈ క్రియలో మనం సులభ మార్గాన్ని సంపాదించుకోవాలి. మన బాలవికాస్

అధ్యాపకులందరూ ఈ ఆరువిధములైన విషయాలను చక్కగా అర్థం చేసుకొని వాటిని ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించాలి. ఈనాడు విద్యయొక్క విలువ పూర్తి దిగజారిపోయింది. విద్య కేవలం నాలుకపై నిలిచిందిగాని నిజమైన విద్య హృదయంలో లేకపోతున్నాది. విద్య కేవలము చదవటంతో వచ్చేది కాదు. మన జీవితమంతా విద్యమీదే ఆధారపడి ఉంటున్నాది. ఒక మార్కెట్టుకి వెళ్లి ప్రతి పదార్థముయొక్క విలువను, మంచిచెడ్డలను విచారించుట కూడను విద్యయే. బజారులో ఏవిదంగా నడచుకొనిపోవాలో తెలుసుకొనుట విద్యయే. వంట ఏవిధంగా చేయాలని తెలుసుకోవటంకూడా ఒక విద్యయే. వ్యాపారము ఏవిదంగా చేయాలో తెలుసుకోవటంకూడా విద్యయే. విద్య అనగా కేవలము వివేకమును బోధించే విధానమే విద్య. కేవలము వివేకాన్నే కాదు, మనము సాధించిన వివేకాన్ని వినియోగ పెట్టుకునే విధానములోకూడను ఒకవిధమైన విద్య లభిస్తున్నాది.

కనుక, ఈనాడు శాస్త్రీయమైన విద్య విరివిగా పెరిగినప్పటికీ దానిని వినియోగించుకొనే విజ్ఞానము మన మననమందు లేకపోతే ఈ శస్త్రమంతా నిరుపయోగమైపోతుంది. విజ్ఞానము ఆర్జించటమే కాకుండా దానిని వినియోగించుకొనే విధానాన్ని మనము తెలుసుకోవాలి. కేవలము వినియోగించుకోవటమేకాదు సద్వినియోగం చేసుకోవాలి. మనము జీవితమంతా ముఖ్యమైన టువంటిదిగాను, శోభాయమానమైనదిగాను, ఆదర్శవంతమైనదిగాను, ఆనందదాయకమైనదిగాను రూపొందింపజేసుకోవాలి.

ప్రతి మానవుడు ఆనందం కావాలని కోరుతున్నాడు. కాని, ఆనందాన్ని పొందే విధానాన్ని అనుసరించటం లేదు. కోరినంత మాత్రమున మనకు లభిస్తుందా? ఇది మన జీవితంలో మనం అనుభవించటానికి జరిగేటువంటి అవగాహనని మనం అందుకోవాలి. ఒక చిన్న ఉదాహరణ. మనము ఆహారము భుజిస్తున్నాము. ఈ ఆహారంలో కొంత ఉప్పు తక్కువైందంటే ధన్‌మని దానిని ప్రక్కకు నెట్టివేస్తాము. కొన్ని గంటలలో అరిగిపోయే పదార్థము సరైన రుచి లేకపోతే దానిని ప్రక్కకు నెట్టివేస్తున్నాము. 70 సంవత్సరములు, 80 సంవత్సరములు 90 సంవత్సరములు జీవించే ఈ జీవితానికి, దీంట్లోకూడా ఒక టేస్టు ఉండనక్కరలేదా! మనం మంచిని కోరుతున్నాము. కాబట్టి ఆ మంచి మనలో ప్రవేశించాలి. మనము ఇతరుల వలన గౌరవింపబడాలని కోరుతున్నాముగానీ మనము ఇతరులను గౌరవిస్తున్నామా? కనుక, ఇతరులు మనలను ఏవిదంగా భావించాలని కోరుకుంటామో మనం ఇతరులనుకూడా ఆవిధంగానే భావించటానికి ప్రయత్నించాలి. అపుడే అధ్యాపకులకు సరియైన అధికారము లభిస్తుంది. పిల్లలకు ఏవిషయము బోధిస్తున్నామో ఆ విషయము మనలో ప్రకటిస్తూ రావాలి. కొంమంది తాము మాత్రము తక్కగా సిగరెట్టు త్రాగేస్తూ, 'ఏయ్! సిగరెట్టు కాల్చవద్దు, తప్పు'అంటే వారు ఏమని జవాబు చెబుతారు. ఈవిధంగా అధికారము పేరిట మనం బోధచేస్తున్నాము. వాడు తెలివితేటలు కలిగిన విద్యార్థి అయితే, 'తాను త్రాగితే ఏమిటి నష్టము?' అని అడుగుతాడు. దీనివల్ల క్యాన్సర్ వస్తుంది, ఊపిరితిత్తులు చెడిపోతాయి అని చెప్పవచ్చును. క్యాన్సర్ వచ్చేటట్లుగా వుంటే, దీనివల్ల నష్టమే వుంటే మీరెందుకు త్రాగుతున్నారు అని అడుగుతాడు. నీవు అప్పుడు ఏమని సమాధానము చెబుతావు? కనుక, ఇలాంటి అధికారములేని బోధచేస్తే విద్యార్థి ఏరీతిగా అనుసరిస్తాడు? కనుక, విద్యార్థియొక్క లక్ష్యము అభివృద్ధి కావటంచే మనముకూడా ఆ శాశ్వతమైన మార్గములో ప్రవేశించాలి.

మీరు ముఖ్యముగా, విదేశాలలో ఉంటున్నవారు కనుక, మీరు ప్రధానముగా పిల్లలకు బోధించే అంశములు అనేకము ఉంటున్నాయి. కొన్ని ఆహారముచేతనే ఆరోగ్యాన్ని అభివృద్ధిగావించుకోటానికి అవకాశము ఉంటుంది. ఈ ఆహారము సరియైనది కాకపోవటంచేత వారికి అనారోగ్యములుకూడా ఏర్పడుతుంటాయి. ఈ అనారోగ్యము రెస్టు ఎక్కువగా తీసుకోవటంచేతనే. ఈనాడు విదేశములలో వారికి సహజమైన నిద్రకూడను లేదు. ఆ నిద్రకూడను పిల్సు వేసుకొని నిద్రపోతున్నారు. కననుక, జీవితమంతా కృత్రిమ జీవితంగా తయారౌతున్నది. చిన్నచిన్న పిల్లలుకూడా ఈ డ్రగ్స్ వేసుకోవటమో, ఇంకా అనేకరకములైన దురభ్యాసములతో పోతుండటము, చాలా అభివృద్ధి అవుతున్నాది. ఇది కేవలము తల్లిదండ్రుల ద్వారానే కొంతవరకు ప్రారంభము అవుతుండాది. మనము పిల్లలను సరిచెయ్యాలనుకుంటే, దానికి కావలసినంత వ్యవధే ఉంటే, తల్లిదండ్రులకు కూడా చెప్పటానికి మనకు కొంచెం సిద్ధంగా ఉండాలి. ఇదికూడా ఒకవిధమైన సేవగా వుంటుంది. కేవలము పిల్లలు మన దగ్గర ఉన్నంతవరకు వారికి చక్కటి సేవలు చేసిన ఇంటికి పోయిన తక్షణమే తల్లిదండ్రుల ద్వారా పెడమార్గము పట్టుటచే దాన్ని మనము సరిదిద్దలేము. తండ్రి ఒక బాటిల్ తీసుకొని, భార్యకు ఒక బాటిల్ యిచ్చి, కుమారునికి ఒక బాటిల్ యిస్తే కుమారుదేమి చేస్తాడు! కనుక, తల్లిదండ్రులు బాటిల్ తీసుకున్నాగానీ మీరు వాటర్ తీసుకోవాలి, బాటిల్ ముట్టకూడదు. ఆవిధంగా చెయ్యాలి. మీరు ఈవిధమైన, బలమైనఉపదేశము చేసినప్పుడే ఈనాడు పాశ్చాత్య దేశములలో పెరిగిపోయిన దురలవాట్లను కొంతవరకు అరికట్టటానికి అవకాశముంటుంది.

సాత్వకాహారాన్ని భుజించమని మీరు ప్రబోధించాలి. కేవలము పొట్టకూటి నిమిత్తమే ప్రాకులాడే చదువులే మనం చూసుకుంటున్నాము. ఎందుకంటే ఇది కేవలము జీవితము కోసముకాదు, జీవిత పరమావధికోసం. జీవిత పరమావధిని పిల్లలకు బాగా నొక్కి చెప్పాలి. మీరు చెప్పటానికి సిద్ధపడేటప్పుడు మీరుకూడను దీనిని ఆచరించాలి. ఏ కొంతమందైనా ఈవిధమైన దీక్ష పడితే తప్పక మీరు దేశాన్ని ఎంతో బాగుచేసినవారౌతారు. ఈ దేశ సేవయే దైవసేవగా భావించుకోవాలి. one should posses the head of janaka , the head of sankara, the heart of buddha. అనగా ఏమిటి? క్రియాచరణచేస్తూ, కేవలము ఆచరిస్తూ దీనియొక్క ఫలితమును ఏమాత్రమూ చింతించకుండా ఉండటము జనకునియొక్క నిష్కామకర్మ. దీనినే రాజయోగమనికూడము వసిష్ఠుడు

చెబుతూవచ్చాడు. రాజయోగము అనగా ఏమిటి? hands in society, head in the forest. మనము చేతులతో పనిచేయటమే తప్ప, దానియొక్క ఫలితము కోసము ఈ తలను ప్రవేశపెట్టకూడదు. ఈ చేతులు చేసిన పనిలో తలను ప్రవేశపెట్టాలి. తలను ఫలితంపైన, చేతులు పనిపైన పెడితే ప్రయోజనం లేదు. రెండిటినీ కూడను అక్కడే చేర్చాలి. నెగిటివ్ ఒకవైపున, పోజిటివ్ ఒకవైపున ఉంటే ప్రయోజనం లేదు. ఈ నెగిటివ్, పోజిటివ్ రెండింటిని చేర్చి మనం పనిచేయాలి. కనుక, నీవు హెడ్ అండ్ హ్యాండ్ రెండిటిని అక్కడ చేర్చి ఒక్క పనిగా చేయాలి.

మన హార్ట్ విశాలంగా ఉండాలి. బుద్ధుడు చెబుతాడు, 'సర్వం దుఃఖం, దుఃఖం'. నాకు మాత్రమేకాదు, నీకు మాత్రమేకాదు, అతనికి మాత్రమేకాదు అందరికీ ఈ జగత్తు దుఃఖమే. అందరికీ సమత్వమైన స్థితియే ఉండటముచేత ఇంక ఒకరినొకరు నిందించుకోవటానికిగాని, ఒకరికొకరు ఆంక్షలు పెట్టుటకుగాని అవకాశాలు లేవు. కనుక, విశాలమైన దృష్టిని తాను పెట్టుకున్నాడు. హృదయంలో విశాలత్వమును మనం అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. ఎందువల్లనంటే. 'సర్వం క్షణికం, క్షణికం'. ప్రతి క్షణమూ మార్పుచెందేటువంటిదే. ఈ సత్యాన్ని మనము హృదయములో పెట్టుకోవాలి. ఒక దుఃఖం వస్తే, ఇది క్షణకాలమే, ఒక సంతోషము వస్తే ఇదీ క్షణకాలమే. ఈ రెండింటియందు సమదృక్పథము పెట్టుకోవటం ప్రయోజనకరం. బుద్ధుడు తన తండ్రి వచ్చి, 'నాయనా! నేను పెద్ద మహాచక్రవర్తిని, నా తండ్రి చక్రవర్తి, నా తాత చక్రవర్తి. నీవుకూడా చక్రవర్తి కావలసినవాడవు' అని రమ్మని కోరినప్పుడు, 'నీవు చక్రవర్తి కావచ్చు, నీ తాత చక్రవర్తి కావచ్చు, నీ నాన్న చక్రవర్తి కావచ్చు కాని నేను మాత్రము వట్టి బిచ్చగాడినే, నా తాత బిచ్చగాడే. నీది నీదే, నాది నాదే' అన్నాడు. ఎందుకయ్యా ఈ బిచ్చగాడు అనే పదము వచ్చింది అని అడిగితే, ఒక చిన్న ఉదాహరణ. నీ దగ్గరకు వచ్చి ప్రజలు ఓ చక్రవర్తీ! నాకు ఆ పని కావాలి, ఈ పని కావాలని అడుగుతారు. కాని, నీకు కోరికలున్నాయి. నీవు భగవంతుని దగ్గరకు వచ్చి వేడుతున్నావు, నా రాజ్యానికి ఇంకొక రాజ్యము చేరిపోవాలని నీవు ఆశలో పడుతున్నావు. ఇది బిచ్చగాని పనికాక ఏమిటి? క్వాంటిటీ తేడాగాని క్వాలిటీ ఒక్కటే. ఈవిధమైన సమత్వాన్ని సాధించినవాడు బుద్ధుడు.

ఇక శంకరాచార్యులు. అతనికి ఏవిధమైన భేదభావము లేదు. రెండవ పదార్థమనేదే లేదు. కనుక, అంతా ఒక్కటే. 'ప్రజ్ఞానం బ్రహ్మ' అన్నాడు. అనగా రెండవది లేనటువంటిది. ఇది ప్లేటు, ఇది కప్పు. ఈ కప్పు, ప్లేటుకు రూపనామములు వ్యత్యాసములేగాని రెండింటి విలువ ఒక్కటే. ఇది కర్చీఫ్. ఈ కర్చీఫ్‌లో ఏమి చేరి ఉంది? దారము చేరి ఉంది. దారములో ఏమి చేరి ఉంది. ప్రత్తి చేరి ఉంది. కనుక, ఈ ప్రత్తిలోగాని, ఈ దారములోగాని, ఈ గుడ్డలోగాని ఒకే పదార్థముంటున్నాది. సర్వులయందు ఆత్మతత్త్వము ఒక్కటే. ఈ ఏకత్వాన్ని తీసుకుంటే ఈ ద్వేష, అసూయలు, దంభము, అహంకారములకు ఏమాత్రము అవకాశముండదు. భిన్నత్వంలోని ఏకత్వాన్ని చూడమని శంకరులు బోధించారు. కనుక, ఈ ఏకత్వాన్ని బోధించే శంకరాచార్యులను, విశాలత్వాన్ని బోధించే బుద్ధతత్త్వాన్ని, ఈ కర్మఫలత్యాగము బోధించిన జనకునియొక్క తత్త్వము మన హృదయము, పై మూడింటియందు చేరుకోవాలి.

ఈ పవిత్రమైన బోధలు అన్ని మతములలోను ఉంటున్నాయి. ముస్లిం మతములో, సిక్కు మతంలో, బౌద్ధ మతంలో, జైన మతంలో. అన్ని మతములు ఏకత్వమనే మహత్వం మనకు బోధిస్తున్నాయి. సర్వ మతముల సారము ఒక్కటే. ఈవిధమైన ప్రచారము మన అధ్యాపకులు చేయాలి.

ఈనాడు ప్రపంచములో వ్యక్తిగతమైన ద్వేషములు పెంచుకోటం చేతనే మతద్వేషములుకూడా పెరిగిపోతున్నాయి. అధ్యాపకులు విద్యార్థులకు సర్వమతసమత్వమనే సాయితత్త్వాన్ని చెప్పాలి. సర్వుల సమత్వమే సాయితత్త్వం. అటువంటి బోధలు ఈనాడు విద్యార్థులకు చేసినప్పుడే విద్యావిధానముకూడను ఉన్నతస్థాయిని అందుకుంటుంది. ఈనాడు విద్యార్థులంతా కూడను లౌకికవిద్యనే అభ్యసించటానికి అభిలషిస్తున్నారు కనుక, ఈ లౌకికవిద్యయందుకూడను మానవాభ్యుదయాన్ని కొంతవరకు మీరు చేర్చి ఈ ఆరువిధములైన సోపానములు వారికి బోధించటానికి ప్రయత్నించండి. అధ్యాపకులందరూ ఈ పవిత్రమైన భావాలు మీరు కొంతవరకు అర్థంచేసుకొని దానిని ఆచరణలో పెట్టి తగిన అభివృద్ధిలో జీవిస్తారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.